క్లుప్తంగా

పరామర్శ



ఈశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి, తదితరులు

వేపాడ: మండలంలోని పాటూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి ద్వారపూడి గంగునాయుడు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు బుధవారం పరామర్శించారు. గంగునాయుడు బావ గొర్లె ఈశ్వరరావు గుండెపోటుతో ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు పాటూరు వెళ్లి మృతుడు ఈశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ సత్యవంతుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జగ్గుబాబు, జేసీఎస్ ఇన్‌చార్జ్ బోజంకి శ్రీను, సోంపురం ఎంపీటీసీ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ గళ్ల శ్రీరాములునాయుడు, నాయకులు దుల్ల మహేష్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



అంబటివలసలో ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

బొండపల్లి: మండలంలోని అంబటివలసలో ఆక్రమణలకు గురైన కొండ పోరంబోకు ప్రభుత్వ భూముల్లో తహసీల్దార్ డోల రాజేశ్వరరావు బుధవారం బోర్డులు ఏర్పాటు చేయించారు. సర్వే నంబర్లు 69-2, 69-3, 69-4లో ఉన్న 5.48 ఎకరాల విస్తీర్ణం ప్రభుత్వ భూమి అని.. ఎవ్వరు ఆక్రమించినా, సాగు చేపట్టినా శిక్షార్హులని తెలియజేస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ పి.సతీష్, వీఆర్ఓ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మాపై దయ చూపరూ..!



విధుల్లో కొనసాగించాలని కోరుతున్న తెట్టంగి ఆయాలు, నైట్ వాచ్‌మన్

గుర్ల: మండలంలోని తెట్టంగి జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో నైట్ వాచ్‌మన్, ఆయాలుగా పనిచేస్తున్న తమను కొనసాగించాలని వాచ్‌మన్ పాండ్రంగి లక్ష్మణరావు, ఆయాలు బడారి పైడమ్మ, దాసరి సన్యాసమ్మ, సామోదుల అసిరమ్మ కోరారు. ఈ మేరకు గురువారం వారు మాట్లాడుతూ, రెండేళ్లుగా ఎటువంటి ఫిర్యాదు లేకుండా విధులు నిర్వహిస్తున్నామని.. అయితే రాజకీయ కక్షతో తమను తొలగిస్తారనే ప్రచారం జరుగుతోందని తెలిపారు. అధికారులు దయచూపి తమను కొనసాగించాలని కోరుతూ ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఎస్ఎంసీ చైర్మన్లకు వినతిపత్రాలు అందజేశారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌ను వేగవంతం చేయండి



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ అచ్యుతకుమారి

గంట్యాడ: బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఆర్.అచ్యుతకుమారి వైద్య సిబ్బందిని ఆదేశించారు. కొర్లాం గ్రామంలోని విలేజ్ క్లినిక్‌లో బుధవారం నిర్వహించిన బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఇంతవరకు ఎంతమందికి వ్యాక్సిన్ వేశారని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. విలేజ్ క్లినిక్‌కు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని, విధుల్లో అలసత్వం వహించవద్దని చెప్పారు. హెచ్ఈఈఓ రత్న, ఎంపీహెచ్ఈఓ కె.ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

చీపురుపల్లి: నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల్లో నూతనంగా వ్యాపార సంస్థలు నెలకొల్పి కార్యకలాపాలు నిర్వహించే వారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇది వరకే రిజిస్ట్రేషన్ చేసుకుని వ్యాపారాలు సాగిస్తున్న వారు రెన్యూవల్ చేసుకోవాలని సహాయ కార్మికాధికారి బి.కొండలరావు తెలిపారు. పట్టణంలోని పలు దుకాణాలు, వ్యాపార సంస్థల్లో బుధవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. రిజిస్ట్రేషన్, రెన్యూవల్‌ను గ్రామ సచివాలయం లేదా మీసేవా కేంద్రాల్లో చేసుకోవాలని చెప్పారు. అలాగే వ్యాపార సంస్థల్లో పని చేస్తున్న కార్మికులు ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.100 చొప్పున కార్మిక సంక్షేమ నిధికి చెల్లించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు సాగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గంజాయి రవాణాపై ఉక్కు పాదం

- ఎస్పీ వకుల్ జిందాల్



శృంగవరపుకోట: ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

శృంగవరపుకోట: గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలని, గంజాయి వ్యాపారం మూలాలు తీసేసేలా పని చెయ్యాలని జిల్లా ఎస్పీ వకుల జిందల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎస్.కోట సర్కిల్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు, సీజ్ చేసిన వాహనాలు, రికార్డులు, సీడీ ఫైల్స్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజ్ చేసిన వాహనాలపై కేసు వివరాల లేబుల్స్ వేయాలన్నారు. అల్లూరి జిల్లా నుంచి బొడ్డవర మీదుగా గంజాయి రవాణా నియంత్రణకు చెక్ పోస్టును బలోపేతం చేయాలన్నారు. నిరంతర వాహన తనిఖీలతో పాటు, డైనమిక్ చెకింగ్స్ చేయాల న్నారు. పట్టుబడ్డ నిందితులపై హిస్టరీ షీట్లు తెరవాలని, పరారీలో ఉన్న నిందితులను అదుపు లోకి తీసుకుని, కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేయాలని చెప్పారు. తరచూ రహదారి ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్స్‌పై ఆరా తీసి, ఆయా ప్రాంతాల్లో కాషనరీ బోర్డులు పెట్టాలని, స్పీడ్ బ్రేకర్లు, స్టాపర్లు ఏర్పాటు చేయాలని, విజిబుల్ పోలీసింగ్ చేయాలన్నారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వారిపై, ట్రిపుల్ రైడర్స్‌పై గట్టి నిఘా ఉంచాలని చెప్పారు. పెట్రో లింగ్ ముమ్మరం చేసి, పోలీసు లు తమ దత్తత గ్రామాలను తరచూ చూస్తూ ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సైబర్ నేరాల్లో ఫ్రీజ్ అయిన నిందితుల ఖాతాల్లో నగదును బాధితులకు వచ్చేలా చూడాలన్నారు. శాంతి భద్రతల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఆయన వెంట విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ కె.కె.వి.విజయ్‌నాథ్, ఎస్.కోట సీఐ వి.ఎన్.మూర్తి, రూరల్ సీఐ కె.రవికుమార్, ఎస్ఐ గంగరాజు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేకదృష్టి



జామి: రోడ్డు ప్రమాదాలపై ఎస్ఐ వీరబాబును ఆరా తీస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

జామి: మండలంలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేకదృష్టి సారించాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఎస్ఐ వీరబాబుకు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆయన సందర్శిం చారు. స్టేషన్ పరిసరాలను, రికార్డులను, సీజ్‌చేసి వాహనాలను, క్రైమ్ చార్ట్‌ను పరిశీలించారు. మండలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా ఏయో ప్రాంతాల్లో జరుగుతున్నాయి, వాటి నియం త్రణకు తీసుకుంటున్న చర్యలపై ఎస్పీ ఆరా తీశారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, స్టాపర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్త చట్టాలు, సైబర్ మోసాలు, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, మహిళల రక్షణ చట్టాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. దొంగతనాల నియంత్రణకు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. వినాయక నిమజ్జనం చేపట్టే చెరువులు, నదుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

14న జిల్లా స్థాయి భూసదస్సు



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు

లక్కవరపుకోట: వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఈనెల 14వ తేదీన నిర్వహించనున్న జిల్లా స్థాయి భూ సదస్సును విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బా రావు కోరారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు, పేదల కు దక్కాల్సిన డీపట్టా ,ప్రభుత్వ బంజరు, పోరంబోకు , పోడు, ఇనాం తదితర భూములు పెద్దల చేతికి వెళ్లి అన్యా క్రాంతమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తరతరాలుగా భూములు సాగు చేసుకుంటున్న పేద రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెంటనే అమలు చేయాలన్నారు. వ్యవసాయ కార్మికులు, రైతుల సమ స్యల భూసదస్సులో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సదస్సుకు వ్యవసాయకార్మికులు, రైతులు హాజరు కావాలని కోరారు.ఆ సంఘ నాయకులు గాడి అప్పారావు, తరణి వెంకటరమణ పాల్గొన్నారు.

లారీ బోల్తా..

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం పోలీస్ స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఓ లారీ బోల్తా పడింది. చర్చివీధి కాలనీ వైపు కల్వర్టుపై దూసుకెళ్లి బోల్తా పడినప్పటికీ.. డ్రైవర్, క్లీనర్‌లకు ఎటువంటి గాయాలు కాలేదు. ఈ విషయమై పెదమానాపురం ఎస్సై జయంతి వద్ద ప్రస్తావించగా ప్రమాదానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

నేడు గ్రామసందర్శన

చీపురుపల్లి/వేపాడ/దత్తిరాజేరు/లక్కవరపుకోట/కొత్తవలస: చీపురుపల్లి మండలంలోని కర్లాం, వేపాడ మండలంలోని వీలుపర్తి, దత్తిరాజేరు మండలం లోని భూపాలరాజపురం,ఎల్.కోట మండలంలోని జమ్మాదేవిపేట, కొత్తవలస మండలంలోని చీడివలసలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం ని ర్వహించనున్నారు. ఆయా మండలాల ఎంపీడీఓలు కె.రామకృష్ణరాజు, బి.ఎస్.ఎన్.కూర్మనాథ్ పట్నాయక్, సుబ్రహ్మణ్యం, కె.రూపేష్, వై. పద్మజ బుధ వారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు.అన్ని శాఖల అధికారులు హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని సూచించారు.

ఓనం పండగ



వేడుకల్లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

శృంగవరపుకోట: కేరళలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించుకునే ఓనం పండగను స్థానిక వివేకానంద విద్యాసంస్థల్లో బుధవారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు వివిధ పుష్పాలు, ఆకులు, ఉపయోగించి తీర్చిదిద్దిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. కేరళ కుట్టి, వామనుడు, కాంతార, మయూరాలు, పద్మాలు, ఇలా విభిన్నంగా, సంస్కృతీ సంప్రదాయాలను చాటారు. విద్యార్థినులను వివేకానంద విద్యాసంస్థల అధినేత సీహెచ్.ఆర్.కె.ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎం.భాస్కర్‌రావు అభినందించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం దిగ్విజయ్ దివస్ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో స్వామివివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి



వైద్యశిబిరంలో వైద్యాధికారులకు సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

గజపతినగరం: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి జ్వర పీడితులు, ఆరోగ్య సమ స్యలతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఎం.వెంకటాపురం గ్రామం లో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.పుష్పాంజలి,డి.సుష్మ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన సందర్శించారు. శిబిరంలో సేవలు పొందిన రోగుల వివరాలు, అందుబాటులో ఉంచిన మందులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

మస్తర్లల్లో దిద్దుబాట్లు ఉండకూడదు

- ప్రజావేదికలో డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి



ప్రజావేదిక సభలో మాట్లాడుతున్న పీడీ ఉమాపరమేశ్వరి

బొండపల్లి: ఉపాధి పనులకు హాజరయ్యే వేతనదారుల మస్తర్లల్లో దిద్దుబాట్లు లేకుండా క్షేత్ర సహాయకులు చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి సూచించారు. మండలంలో 2023–2024 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై గ్రామాల్లో డీఆర్పీలు ఇటీవల సోషల్ ఆడిట్ పూర్తి చేశారు. ఈ నివేదికలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ప్రజావేదిక నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో వేతనదారులు వేతనాలు, పంచాయతీ రాజ్ విభాగంలో చేసిన వివిధ పనులకు, సామాజిక అడవుల పెంపకం కోసం రూ. 20.96 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. తమటాడ గ్రామంలో 18 మంది వేతనదారులు పనులకు హాజరు కాకపోయినా వారిపేరున మస్తర్లు వేసి డబ్బులు డ్రా చేశారని డీఆర్పీలకు ఆ గ్రామానికి చెందిన కొందరు సోషల్ ఆడిట్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి నివేదిక అందజే యాలని ఉపాధి హామీపథకం అధికారులను ఆదేశించారు.ఎంపిపి చల్లా చలంనాయుడు, క్లస్టర్ ఏపీడీ జి.జనార్దనరావు, డీవీఓలు వెంకటరమణ, ఎ.భానూజీరావు, పించ్లన్ల ఏపీడీ రమేష్, ఎస్ఆర్పీ ఎస్.లక్ష్మణరావు, ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్, ఏపీఓ బి.కృష్ణవేణి, పంచాయతీ రాజ్ జేఈఈ కె.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దిగ్విజయ్ దివస్



శృంగవరపుకోట: ఎస్.కోట డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం దిగ్విజయ్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి ప్రిన్సిపాల్ సీహెచ్.కేశవరావు, అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వామి వివేకానంద 1893 సెప్టెంబర్ 11న అమెరికాలోని చికాగో పట్టణంలో ప్రపంచ మతాల సమావేశంలో భారత్ ప్రతినిధిగా మాట్లాడి హైందవ మతం కీర్తిని, భారత్ ఔన్నత్యాన్ని ప్రపంచం నాలుగు చెరగులా చాటాడన్నారు. ఈసందర్భాన్ని పురస్కరించుకుని దిగ్విజయ్ దివస్ నిర్వహిస్తున్నామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ వాసుదేవరావు మాట్లాడుతూ భారత్ అన్ని మతాలను గౌరవిస్తుందని అన్నారు .చిన్న చిన్న నదులన్నీ ప్రవహించి చివరకు చేరేది సాగరంలోనే అన్న తీరుగా అన్ని మతాల గమ్యం భగవంతుని సన్నిధి చేరడమే అంటూ భారతీయ ఆత్మను ఆవిష్కరించిన మహా తాత్వికుడు స్వామి వివేకానంద అని అన్నారు.



చీపురుపల్లి: స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆశయ రమణ, తదితరులు

వివేకానంద ఆశయాలను కొనసాగించాలి

చీపురుపల్లి: భారతీయ సనాతన ధర్మాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని, ఆయన ఆశయాలను యువత కొనసాగించా లని ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. స్వామి వివేకానంద చికాగో నగరోపాన్యాసాలకు 130 సంవత్సరాలు పూర్తయిన సందర్భం గా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్ వద్ద స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు యువకులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతం



జామి: అలమండలో గర్భిణులకు సీమంతం చేస్తున్న పీఓ ఉమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు

జామి: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని అలమండ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ పీఓ ఉమాదేవి ఆధ్వర్యంలో బుధవారం సామూహిక సీమంతం నిర్వహించారు. ఈసందర్భంగా పీఓ మాట్లాడుతూ గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన శిశువులు జన్మిస్తారని చెప్పారు. బాలింతలు, గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. ఆకుకూరలు, పప్పు దినుసులు, చిరుధాన్యాలు, బెల్లం, మినరల్స్ తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను గర్భిణులు, బాలింతలు తిలకించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విమలకుమారి పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ



లక్కవరపుకోట: ఎల్.కోటలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

లక్కవరపుకోట: పౌష్టికాహారం ఆవశ్యకతపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు సమపాలల్లో తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటామని వివరించారు. రాగి మాల్ట్, పప్పు చెక్కీలు, మునగాకు, దానిమ్మ పండ్లు, గుమ్మడి పిక్కలు వంటి వాటిల్లో ఐరన్ పుష్కలంగా ఉంటుందని, వీటిని ఆహారంగా తీసుకుంటే రక్తహీనత సమస్య తలెత్తదని తెలిపారు.

ప్రభుత్వ నిర్లక్ష్యానికి ప్రజల ప్రాణాలు బలి

- మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎంపీ,

చీపురుపల్లి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వం తప్పిదం కారణంగానే చరిత్రలో ఎన్నడూ లేనంతగా విజయవాడ వాసులు నరకయాతన అనుభవిస్తున్నారని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుఫాన్, అల్పపీడనాల కారణంగా వర్షాలు, వరదలు రావడం సహజమేనని, సమాచారం ముందుగానే ప్రభుత్వాలు తెలుసుకుని ప్రజలకు నష్టం కలగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అయితే విజయవాడను వరదలు ముంచెత్తుతాయని ముందుగానే తెలిసినప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించ డంతో ప్రజలు బలయ్యారని ఆరోపించారు. కనీసం పునరావాస కేంద్రాలు కూడా ఏర్పాటు చేయలేక పోయిందన్నారు. ప్రభుత్వ ఘోర వైఫల్యానికి 50 మంది వరకు ప్రాణాలు కోల్పోగా, రెండు నుంచి ఐదు లక్షల మంది ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని చెప్పారు. వరదలు వచ్చి పదిరోజులు గడుస్తున్నా... ఇప్పటికీ ప్రజ లకు సహాయక చర్యలు అందడం లేదని, మరో పదిహేను రోజులు గడిచినా సహాయం అందుతుందనే ఆశ ప్రజల్లో లేదన్నారు. రాష్ట్ర రాజధానిగా చెప్పుకునే విజయవాడలోనే ఇలా ఉంటే ఇక ఈ ప్రభుత్వం పనితీరు ఎలా ఉందనేది వేరే చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. ఇంత జరిగినా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన పాపాన పోలేదని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు ఇల్లు, ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ పవర్ ప్లాంట్ కాపాడేందుకు బుడమేరు గేట్లు ఎత్తేసి వరదను విజయవాడ మీదకు వదిలేశారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణలంకలో ఐదు కిలోమీటర్ల మేరకు రిటైనింగ్‌వాల్ నిర్మించడంతో నే పెద్ద నష్టం తప్పిందన్నారు. విజనరీ, 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబుకు విజయవాడ వరదల విషయంలో తన విజన్ ఏమైందో చెప్పాలన్నారు. ప్రభుత్వ పెద్దలు తమ నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఎక్కడ ఏ నష్టం జరిగినా అది జగన్ వల్లేనని విమర్శిస్తున్నారని, ఇది వారి చేతకాని తనానికి నిదర్శనమన్నారు. ప్రతిపక్షాలను విమర్శించడం కంటే ప్రజలకు సహాయ చర్యలు చేపట్టడంలో శ్రద్ధ పెట్టాలని హితవు పలికారు.

పాఠశాల భవన నిర్మాణ పనులు ప్రారంభించాలి



భవనం నిర్మించాల్సిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న వలిరెడ్డి శ్రీనివాసనాయుడు

చీపురుపల్లి: విశ్వనాథపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించి, పూర్తి చేయాల ని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు.శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని బుధవారం ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈసంద ర్భంగా మాట్లాడుతూ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన స్పందించి పాఠశాల భవన నిర్మాణానికి జిల్లా పరిషత్ నిధులు రూ.10 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. అయితే కాంట్రాక్టరు పనులు ప్రారంభించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, నాలుగు నెలల్లో భవన నిర్మాణ పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రేవల్ల సత్తిబాబు, ప్రభాత్, తిరుపతి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే లలితకుమారి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

కొత్తవలస: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు ఎరువులు కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మండల వ్యవసాయ అధికారి మాధురీ శరణ్యను ఆదేశించా రు. ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే అతిథిగా హాజరయ్యారు. శాఖల వారీగా మండల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను వివరించా రు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పథకంలో నిలిచి పోయిన పనులను పునరుద్ధరిస్తామని, ప్రతీ ఇంటికి తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు నిధులు మంజూరయ్యాయని, పనులకు సంబంధించి అంచనాలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఖరీఫ్ వరి నాట్లు వేయని రైతులను గుర్తించి, వారికి ప్రత్యామ్నాయ పంటలు సాగుపై అవగాహన కల్పించాలని ఏఓకు సూచించారు. కొత్తవలస రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి పాత ఎంపీడీఓ కార్యాలయం వరకు రోడ్డు పూర్తిగా పాడయ్యిందని, ఈరోడ్డుకు మరమ్మతులు చేయించాలని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే గ్రామాల్లో శిథిలమైన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి వేయాలని కోరారు. వైస్ ఎంపీపీ కర్రి శ్రీను, ఎంపీడీఓ వై.పద్మజ, తహసీల్దార్ బి.నీలకంఠరావు, ఈఓపీఆర్డీ ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

- ప్రకృతి వ్యవసాయం ఆర్‌టీఓ హేమసుందర్



సోంపురం రైతుసేవా కేంద్రంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్‌టీఓ హేమసుందర్

వేపాడ: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పనిచేస్తున్న రైతు సాధికార సంస్థ, సబల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ప్రకృతి వ్యవసాయం రీజనల్ సాంకేతిక అధికారి (ఆర్‌టీఓ) హేమసుందర్ సూచించారు. ఈమేరకు మండలంలోని సోంపురం రైతుసేవా కేంద్రం వద్ద సిబ్బందికి ప్రకృతి వ్యవసాయం సాగుపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయంలో వేపాడ మండలాన్ని మోడల్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. రైతులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిపించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. సబల ప్రాజెక్ట్ ద్వారా రైతులకు అందిస్తున్న ప్రయోజనాలు, సహకారాన్ని ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం అరిగిపాలెంలో 500 లీటర్ల జిల్లేడు ద్రావణం, సోంపురంలో దశపత్ర కషాయం రైతుల సమక్షంలో తయారు చేశారు. కార్యక్రమంలో ఎంటీఎల్ వసంత, సబల పీసీ శ్రావణి, సీఎస్‌పీ వెంకటరావు, రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

లక్కవరపుకోట: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ ఐ.కృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వ రకు ఖాసాపేట,తలారి,కొట్యాడ,రంగరాయపురం, సంతపేట, కూర్మవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.